సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 57 ఫిర్యాదులు నమోదయ్యాయి.

- 8లో ▸



ప్రజలకు చేర్చాలి

సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా అధికారులు చూడాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /17.2

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలిగా ఉంటుంది.

పార్లమెంట్‌పై బీజేపీ ఫోకస్!

పార్లమెంట్ ఎన్నికలలో సత్తా చాటడానికి కాషాయ సేన కసరత్తు చేస్తోంది. జహీరాబాద్ స్థానంలో బీజేపీ జెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో వ్యూహాలకు పదునుపెడుతోంది. ఇప్పటికే పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్, నియోజకవర్గ ప్రభారి మహిపాల్‌రెడ్డి కార్యకర్తలతో సమావేశమవుతూ ఎన్నికలకు సన్నద్ధం చేస్తున్నారు. సోమవారం పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్ ముఖ్య నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు.

- జహీరాబాద్ స్థానంలో గెలుపే లక్ష్యంగా కాషాయ సేన కసరత్తు
- పార్టీ టికెట్టు కోసం క్యూ కడుతున్న నేతలు
- నేతలతో తరుణ్‌చుగ్ మంత్రాంగం



కామారెడ్డిలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో సమావేశమైన బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్

సాక్షి, కామారెడ్డి : జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంపై బీజేపీ ఫోకస్ చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో కమలం జెండా ఎగరడం, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాల్లో ఓట్లు పెరిగిన నేపథ్యంతో జహీరాబాద్ సీటును కైవసం చేసుకునేందుకు బీజేపీ నాయకత్వం దృష్టి సారించింది. ప్రధాని మోదీ చరిష్మా, అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తి వంటి అంశాలతో పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించేందుకు బీజేపీ నాయకత్వం ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా నియోజక వర్గానికి ఎన్నికల ఇన్‌చార్జీగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని నియమించింది. ఆయన పార్లమెంట్ ప్రభారీ బద్దం మహిపాల్‌రెడ్డితో కలిసి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో అనుసరించిన వ్యూహాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాలని ఆయన నేతలకు సూచిస్తున్నారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడకముందే నియోజకవర్గ స్థాయిలో పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశాలు నిర్వహించడం ద్వారా వారిని ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు.

టికెట్టు కోసం పోటీ..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఉన్న చరిష్మా, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటి అంశాలు కలిసి వస్తాయని భావిస్తున్న నేతలు.. బీజేపీ జహీరాబాద్ అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్నారు. ఈ స్థానంనుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నవారి సంఖ్య ఇప్పటికే 35కు చేరుకుందని తెలుస్తోంది. కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన నేతలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన రాష్ట్ర స్థాయి నాయకులు కూడా ఇక్కడినుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. మెదక్ జిల్లాకు చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి పార్టీ అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే కామారెడ్డి జిల్లాకు చెందిన సైంటిస్ట్ పైడి ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లికి చెందిన న్యూస్ చానల్ యజమాని ఏలేటి సురేశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, నేతలు వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి, డాక్టర్ రాంసింగ్, ఎంజీ చక్రవర్తి గౌడ్, సోమాయప్ప స్వామీజీ, ఆలె భాస్కర్.. ఇలా పలువురు బీజేపీ టికెట్టు రేసులో ఉన్నారు. టికెట్టు ఆశిస్తున్నవారిలో కొందరు సేవా కార్యక్రమాలతో జనానికి దగ్గరయ్యేందుకు యత్నిస్తున్నారు. ఓ నేత పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. అలాగే అయోధ్య రాముడి ప్రసాదాన్ని ఇంటింటికి చేరవేస్తున్నారు. మరికొందరు నేతలు ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ అధిష్టానం దృష్టిలో పడేందుకు ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

దిశానిర్దేశం చేసిన తరుణ్‌చుగ్

బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ ఎప్పటికప్పుడు నియోజకవర్గ నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఎన్నికలకు శ్రేణులను సన్నద్ధం చేయడానికి యత్నిస్తున్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ముఖ్య నేతల సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డితో పాటు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నేతలు పాల్గొన్నారు. ఎంపీ ఎన్నికల్లో కలిసికట్టుగా కష్టపడి పార్టీకి విజయం అందించాలని ఆయన వారికి సూచించారు.

జహీరాబాద్ పార్లమెంట్ స్థానంలో గెలిచేది బీజేపీనే..



కామారెడ్డి టౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాలను గెలుచుకునేందుకు బీజేపీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జహీరాబాద్ పార్లమెంట్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మళ్లీ వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి, మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్లమెంట్ ప్రభారి బద్దం మహీపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరుణతార, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్



కామారెడ్డి టౌన్ : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం జరిగిన పరీక్షకు 257 విద్యార్థులకు 248 మంది, మధ్యాహ్నం పరీక్షకు 461 మంది విద్యార్థులకు 426 మంది హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు.

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



కామారెడ్డి అర్బన్ : విద్యాభివృద్ధిలో అధ్యాపకులు భాగస్వాములు కావాలని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ క్యాలెండరును ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు గంగాధర్, జనరల్ సెక్రెటరీ ఇస్రత్, విజయ్, శివ, సంతోష్, లక్ష్మణ్, అశోక్‌గౌడ్, రాజగోపాల్, రజిత, సుజాత, సంతోష్, రాజు, నాగరాజు, సంపత్ రెడ్డి, స్వామిగౌడ్ పాల్గొన్నారు.

‘లగ్గం’ సినిమా షూటింగ్ ప్రారంభం



బీబీపేట : మండలంలోని జనగామ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త, కాంగ్రెస్ నాయకుడు తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి ప్రొడ్యూసర్‌గా తెరకెక్కుతున్న ‘లగ్గం’ సినిమా షూటింగ్ సోమవారం జనగామలో ప్రారంభించారు. డైరెక్టర్ రమేష్ చెప్పాలా, హీరో సాయిరోనక్, హీరోయిన్ గానవి లక్ష్మీ, రాజేంద్రప్రసాద్, సప్తగిరి, చమ్మక్‌చంద్ర, రచ్చ రవి తదితరులు నటిస్తున్నట్లు తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ పాత రాజు, మాజీ ఉపసర్పంచ్ గజ్జెల ఎల్లం, భరత్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లకు ఆధార్ లింక్ చేసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్ : గృహజ్యోతి పథకం కోసం విద్యుత్ వినియోగదారులు మీటర్ నంబర్లకు ఆధార్, రేషన్‌కార్డు నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణ సోమవారం తెలిపారు. నెలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పొందడానికి వినియోగదారులు బిల్లింగ్ చేసే వారికి ఆధార్ నంబర్, రేషన్ కార్డు నంబరును అందించాలని సూచించారు. ఈ నెలకు సంబంధించి ఇప్పటికే బిల్లింగ్ చేసి ఉంటే వారికి వారం తర్వాత లింకు చేస్తామన్నారు.

ట్రాఫిక్ ఈ-చలాన్లపై రాయితీ గడువు పెంపు

ఖలీల్‌వాడి: జిల్లాలోని ట్రాఫిక్ ఈ-చలాన్లపై రాయితీ గడువును రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 15 వరకు పెంచినట్లు సీపీ కల్మేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెండింగ్ చలాన్లు ఉన్న వారు వెంటనే చెల్లించాలని కోరారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలపై 80 శాతం రాయితీ, ఆర్టీసీ వాహనాలకు 90 శాతం రాయితీ, లైట్ మోటారు, భారీ వాహనాలకు 60 శాతం వరకు రాయితీ కల్పించిన విషయం తెలిసిందే.

పోతంగల్ విండోలో డైరెక్టర్ల రాజీనామా

రుద్రూర్: పోతంగల్ సొసైటీలోని తొమ్మిది మంది డైరెక్టర్లు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 12 మందికి గాను తొమ్మిది మంది తమ రాజీనామా పత్రాలను సోమవారం సంఘం కార్యదర్శి భరత్‌కు అందజేశారు. అనంతరం విండో వైస్ చైర్మన్ పవన్ కుమార్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన మహాజన సభలో పాలకవర్గం రద్దు చేయాలని సభ్యులు తీర్మానం చేసినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో స్వచ్ఛందంగా తొమ్మిది మంది డైరెక్టర్లు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. రాజీనామాను ఆమోదించాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలందేనా?

- మద్దికుంటలో పర్యటించిన వైద్యాధికారులు
- క్యాన్సర్ బాధితుల వివరాల సేకరణ
- క్యాన్సర్ కేసుల సంఖ్యను తక్కువగా చూపే ప్రయత్నం



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సాక్షి, కామారెడ్డి: క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామంలో సోమవారం వైద్యాధికారులు పర్యటించారు. ‘పల్లె కడుపున రాచపుండు’ శీర్షికన సోమవారం ‘సాక్షి’ మెయిన్ పేజీలో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు.. వెంటనే గ్రామానికి వెళ్లి నివేదిక ఇవ్వాలని జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్‌ను ఆదేశించారు. డీఎంహెచ్‌వోతో పాటు ఇతర వైద్య అధికారులు సోమవారం మద్దికుంటకు వెళ్లి వివరాలు సేకరించారు. వారు సేకరించిన వివరాల ప్రకారం రెండేళ్లలో క్యాన్సర్‌తో ఐదుగురు మృత్యువాతపడ్డారు. మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. అయితే క్యాన్సర్ కేసులు ఎక్కువ నమోదు కావడానికి కారణాలు అన్వేషించడం, పరీక్షల ద్వారా క్యాన్సర్ బాధితులను గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించాల్సిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు.. గ్రామంలో క్యాన్సర్ కేసులను తక్కువ చూపే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యాధిపై అవగాహన లేనందున బయటపడని కేసులు మరిన్ని ఉండి ఉంటాయని తెలుస్తోంది.

నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తేనే..

క్యాన్సర్‌వ్యాధిపై ప్రజల్లో అనేక అపోహలు, భయాలు ఉన్నాయి. వ్యాధి లక్షణాల గురించి తెలిస్తే ముందుగానే జాగ్రత్త పడే అవకాశాలు ఉంటాయి. మొక్కుబడిగా శిబిరాలు నిర్వహించి చేతులు దులుపుకోవడం ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే మద్దికుంటవాసులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అలాగే గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తే పరిస్థితి అర్థమవుతుంది. తద్వారా వ్యాధి వ్యాపించకుండా చర్యలు చేపట్టడానికి అవకాశం ఉంటుంది. ఒక్క గ్రామంలోనే ఎక్కువ మంది క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నందున అందుకు కారణాలను అన్వేషించాల్సి ఉంది.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్ : పంచాయతీల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో సోమవారం ప్రత్యేకాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సర్పంచుల విధులు, బాధ్యతలు, పంచాయతీ రాజ్ చట్టం–2018పై అవగాహన కల్పించారు. పంచాయతీల్లో ఈ నెల 7 నుంచి 14 వరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని, అందులో ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు తదితర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి గ్రామసభలో చర్చించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో ఆదర్శంగా నిలిచిన పంచాయతీలను ఎంపిక చేసి ఈనెల 15న సన్మానించాలని సూచించారు. యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారకుండా గ్రామ ప్రగతిలో మమేకం అయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. వంద శాతం పన్నులు వసూలు చేయాలని, నిబంధనల మేరకు భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు సరిగ్గా జీతాలు అందేలా చూడాలన్నారు. ఎంపీడీవోలు, ఎంపీవోల సహకారంతో 15వ ఆర్థిక సంఘం కింద ఉపాధి హామీ పనులు గుర్తించి చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్ : జిల్లా ఎస్పీ కార్యాలయం సమీపంలోని గోదాంలో ఈవీఎంలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం పరిశీలించారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం తాళాలు తెరిచి ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. ఓటింగ్ యంత్రాల పనితీరును పరిశీలించేందుకు 9 మందితో కూడిన ప్రత్యేక బృందం జిల్లాకు చేరుకుందని ఈనెల 14 వరకు బ్యాలట్ యూనిట్లు కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్‌లను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కొనసాగేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల విభాగం అధికారులు అనిల్ కుమార్, ఇందిరా ప్రియదర్శిని తదితరులున్నారు.

ఎదిగిన కొద్దీ ఒదిగుండాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి వైబ్రేషన్ ఫెస్ట్



ఎమ్మెల్యే, కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ప్రతి వ్యక్తి గతాన్ని గుర్తు చేసుకుంటూ వర్తమానంలో సరిదిద్దుకుంటూ భవిష్యత్తు కోసం బాటలు వేసుకున్నప్పుడే ఉన్నతస్థాయికి ఎదుగుతామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి వైబ్రేషన్ ప్రోగ్రాం(కల్చరల్ ఫెస్ట్) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను, ప్రతిభను వెలికి తీసి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం కోసం కృషి చేయాలన్నారు. పేద విద్యార్థినులు భవిష్యత్తు నిర్మాణం కోసం రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల కళాశాలలను నెలకొల్పిందన్నారు. గురుకులాలు నెలకొల్పినప్పటికి అన్ని సీట్లు భర్తీ కాకపోవడం బాధాకరంగా ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని సీట్లు భర్తీ అయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లాడుతూ సావిత్రి భాయి పూలేను ఆదర్శంగా తీసుకొని బాలికలు చదువులో రాణించాలన్నారు. బాలికలు ఇష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలన్నారు. పట్టుదల ఉంటే కానిది లేదని ప్రణాళిక బద్ధంగా చదివి సమాజంలో మంచి గుర్తింపు ఉన్న ఉద్యోగాలను పొందాలన్నారు. కళాశాలలో విద్యనభ్యసించి అతిఎత్తయిన పర్వతాలను అధిరోహించిన కళాశాల పూర్వ విద్యార్థి మాలావత్ పూర్ణను అభినందించారు. అనంతరం కళాశాల తరపున ఎమ్మెల్యేను, కలెక్టర్‌లను జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా 24 రకాల సాంస్కృతిక, విద్యా సంబంధ కార్యక్రమాల్లో 12 కార్యక్రమాలు మొదటి రోజు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, రీజినల్ కో-ఆర్డినేటర్ అలివేలు, రాష్ట్రంలోని గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ఎమ్మెల్యేలకు నో ఎస్కార్ట్!

- హంగూ, ఆర్భాటం లేకుండా సర్కారు చర్యలు
- పర్యటనల సందర్భంగా యథావిధిగా భద్రత

సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేలకు ఎస్కార్ట్ సౌకర్యం తొలగించినట్లు తెలుస్తోంది. గతంలో ఎమ్మెల్యేల పర్యటనల సందర్భంగా కాన్వాయ్‌కి ముందు, వెనకాల పోలీసు ఎస్కార్ట్ ఇచ్చేవారు. పైలట్‌గా వెళ్లే పోలీసు వాహనం హారన్ ఇస్తూ ముందుకు పరుగులు తీసేది. దాని వెనకాల ఎమ్మెల్యే కాన్వాయ్ వెళ్లేది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలకు ఎస్కార్ట్‌ను ఇవ్వడం లేదు. ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చే మంత్రులు, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు మాత్రమే ఎస్కార్ట్ ఇస్తున్నారు. అది కూడా సీఎంవో నుంచి వచ్చే రేడియో మెసేజ్ ఆధారంగా ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో పర్యటనలకు వెళ్లినపుడు స్థానిక పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. అయితే వాహనాలకు ముందు, వెనకాల ఎస్కార్ట్ మాత్రం లేదు. పోలీసు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాల మేరకు ఈ విధానం పాటిస్తున్నట్టు తెలుస్తోంది. పోలీస్ ఎస్కార్ట్, పైలట్ వాహనాలతో ఎమ్మెల్యేలు ప్రజలకు దూరమవుతారన్న భావనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఎమ్మెల్యే ఏ పార్టీకి చెందిన వారైనా సరే ఎస్కార్ట్ ఇవ్వడం లేదు.

జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయి. కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి,ఎల్లారెడ్డి, జుక్కల్‌లలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మదన్‌మోహన్ రావు, తోట లక్ష్మీకాంతారావు, బాన్సువాడలో బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. కేబినెట్‌లో ఎవరికీ అవకాశం దక్కలేదు. దీంతో వారికి ఎస్కార్ట్ ఏర్పాటు చేయడం లేదు. హంగూ ఆర్భాటం లేకుండా ప్రజల్లో తిరగాలన్న ఉద్దేశంతో ఎస్కార్ట్ విషయాన్ని పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.

అయోధ్య రైలును ప్రారంభించిన కేవీఆర్



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కామారెడ్డి టౌన్: రాష్ట్రం నుంచి అయోధ్య వెళ్తున్న మొదటి రైలును సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో శ్రీరామ మందిర దర్శన్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. శ్రీరాముడి దర్శనార్థం భక్తుల కోసం ఈ రైలు సౌకర్యం కల్పించామని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. బీజేపీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయవాదుల విధుల బహిష్కరణ

కామారెడ్డి టౌన్ : పోలీసుల తీరుకు నిరసనగా కామారెడ్డి న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. పట్టణానికి చెందిన ఒక యువ న్యాయవాదిపై అకారణంగా దౌర్జన్యం చేసి అక్రమ కేసు బనాయించారని నిరసిస్తూ విధులు బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. పట్టణానికి చెందిన న్యాయవాది సింజిత్‌గౌడ్‌పై కామారెడ్డి డీఎస్పీతో పాటు ఓ కానిస్టేబుల్ అసభ్యకరంగా మాట్లాడి, అక్రమంగా అదుపులోకి తీసుకుని జీపులో స్టేషన్‌కు తరలించి రాత్రంతా నిర్బంధించడం దారుణమన్నారు. హోటల్ ముందు పార్క్ చేసి వాహనం విషయంతో చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పినందుకు డీఎస్పీతో పాటు కానిస్టేబుల్ న్యాయవాదిపై చేయిచేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కోర్టు అవరణలో నిరసన తెలిపారు. ఈ ఘటనను నిరసిస్తూ రెండు రోజుల పాటు న్యాయవాదుల విధులను బహిష్కరిస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా సాగుతుంది. ఆదివారం నాటికి 2లక్షల58వేల 281మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసినట్లు ఎస్సై కోనారెడ్డి సోమవారం తెలిపారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 42,500 నగదు, ఏడు సెల్ ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్సై వెంట టాస్క్ ఫోర్స్ ఎస్సై తిరుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఎంఎస్ఎన్ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 1350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గాంధారి: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మగుడి సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. దాడిలో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 2690 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 57 ఫిర్యాదులు అందాయి. అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సాయిభుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినతి

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి ప్రజావాణితో వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలన్నారు. పెండింగ్ బకాయిలను చెల్లించాలన్నారు. సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, యూనియన్ నాయకులు మహబూబ్‌అలీ, ప్రభాకర్, దీపక్, దీవెన పాల్గొన్నారు.

వివాదాస్పదంగా మారిన వాట్సాప్ మెసేజ్


గౌరవనీయులైన ఉపాధ్యాయులు మరియు సిబ్బంది అందరూ భగవంతుడు ప్రతిచోటా మరియు ప్రతి ఒక్కరిలో ఉన్నాడని చెప్పడం చాలా అవసరం. మేము భారతీయులం, ప్రతి భారతీయుడికి గొప్ప సంప్రదాయం మరియు సంస్కృతి ఉంది మరియు భగవంతుని పట్ల మనకు చాలా ఆధ్యాత్మికం ఉంది. మనం అన్ని మతాలు మరియు ఆచారాలను గౌరవించాలి. శుక్రవారం మా స్కూల్ క్యాంపస్‌లో ప్రత్యేక పూజలు చేయవద్దని మా స్టాఫ్ సభ్యులందరినీ నేను అభ్యర్థిస్తున్నాను, ఇది పాఠశాల, ఈ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు

వైరల్‌గా మారిన మెస్సేజ్

లింగంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పాఠశాలలో ఎలాంటి పూజలు చేయవద్దని పాఠశాల వాట్సాప్ గ్రూపులో పెట్టిన మెసేజ్ వివాదాస్పదంగా మారింది. పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీ విగ్రహానికి కొన్నేళ్లుగా ప్రతి శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పూజలు చేస్తున్నారు. గత నాలుగు నెలల క్రితం పదోన్నతిపై హెచ్‌ఎంగా షౌకత్‌అలీ పాఠశాలకు వచ్చారు. ఆదివారం సాయంత్రం ఆయన పాఠశాలకు చెందిన వాట్సాప్ గ్రూపులో పాఠశాలలో అన్ని మతాల విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కావున విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాలలో ఎలాంటి పూజలు చేయవద్దని పెట్టిన మెసేజ్ మండలంలోని పలు గ్రూపుల్లోకి వెళ్లడంతో విషయం వైరల్‌గా మారింది. దీంతో ఏఎస్సై సిబ్బందితో కలిసి పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. హెచ్‌ఎం అందుబాటులో లేకపోవడంతో సిబ్బందితో మాట్లాడారు. ఈ విషయమై స్థానిక ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డిని వివరణ కోరగా పాఠశాల వాట్సాప్ గ్రూపులో మెసేజ్ వచ్చిన విషయం వాస్తవమేనన్నారు. హెచ్‌ఎం అందుబాటులో లేకపోవడంతో మంగళవారం విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.

మహిళలను బంధించిన గ్రామస్తులు

మాచారెడ్డి : అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు మహిళలను బంధించి పోలీసులకు అప్పగించిన సంఘటన సోమవారం పాల్వంచ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇద్దరు మహిళలు పాల్వంచ వీధుల్లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా గ్రామస్తులు అనుమానించి తాళ్లతో బంధించారు. ఇంతలో కొద్దిదూరంలో కారులో ఉన్న ఓ వ్యక్తి వాళ్లు మా మనుషులేనని ఎల్ఈడీ బల్బులు విక్రయిస్తూ మేడారం జాతరకు వెళ్తున్నామని చెప్పడంతో పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వాళ్లు జడ్చర్లకు చెందిన వారుగా చెబుతూ ఆధార్ కార్డులు చూపించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అక్కడి ప్రజాప్రతినిధులతో మాట్లాడి వదిలిపెట్టినట్లు ఎస్సై వివరించారు.

దాబా హోటళ్లు, వాహనాల తనిఖీ



భిక్కనూరు: భిక్కనూరులోని జాతీయ రహదారిపై ఎక్సైజ్ సీఐ మధుసూదన్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అలాగే జాతీయ రహదారిపై ఉన్న దాబా హోటళ్లను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవడంలో భాగంగానే వాహనాలు, దాబా హోటళ్లను తనిఖీ చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్సై శ్రావన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలోని అయ్యప్ప ఆలయంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పోసాన్‌పల్లి గ్రామానికి చెందిన జంగ నర్సింలు ఈనెల 2న రాత్రి ఆలయంలో హుండీని పగులకొట్టి రూ.4వేల ఎత్తుకెళ్లాడని చెప్పారు.

'డేటా' రాష్ట్ర అధ్యక్షుడిగా జంగం శ్రీశైలం



కామారెడ్డి అర్బన్ : డిసేబుల్డ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అసోసియేషన్(డేటా) రాష్ట్ర అధ్యక్షుడిగా కామారెడ్డికి చెందిన ఉపాధ్యాయుడు జంగం శ్రీశైలం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న కృషికి గాను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు శ్రీశైలం పేర్కొన్నారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ప్రత్యేక నోటిఫికేషన్, ఉచిత బస్సు ప్రయాణం కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

సంక్షేమ ఫలాలను ప్రజలకు చేర్చాలి

- రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గవద్దు
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు


నిజాంసాగర్ మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల వద్దకు తీసుకెళ్తూ అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేయాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గం అభివృద్ధి జెడ్పీ చైర్‌పర్సన్ సహకరించడం సంతోషకరమన్నారు. సోమవారం నిజాంసాగర్ మండల పరిషత్ కార్యాలయంలోలో ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి దుర్గారెడ్డి అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెడ్పీచైర్‌పర్సన్ దఫేదార్ శోభ, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా వ్యవసాయశాఖ ఏవో అమర్ ప్రసాద్ మాట్లాడుతూ యాసంగిలో 15,290 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారన్నారు. క్లస్టర్ల వారీగా ఉన్న రైతు వేదికల నిర్వహణ సక్రమంగా లేదని ఏఈవోల పనితీరుపై ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అసహనం వ్యక్తం చేశారు. రైతు వేదికలను ప్రతిరోజు తెరుస్తూ రైతులకు పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇవ్వాలని ఏవోను ఎమ్మెల్యే ఆదేశించారు. 27 రేషన్ దుకాణాలకు గాను నాలుగు రేషన్ దుకాణాల్లో డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తహసీల్దార్ భిక్షపతి పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న రేషన్ డీలర్లను సత్వరం భర్తీ చేయిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో దేవిసింగ్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్‌ను ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అన్ని సబ్‌సెంటర్ల ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారి రోహిత్‌కు ఎమ్మెల్యే సూచించారు. పల్లె దవాఖానా నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఆర్ అండ్‌బీ, ట్రాన్స్‌కోశాఖ ఏఈలు సభకు రాకపోవడం అటవీశాఖ అధికారులు ఎజెండా నివేదికను సభకు ఇవ్వకపోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు ఇప్పించండి

ఆర్నెళ్ల నుంచి కల్యాణలక్ష్మి చెక్కులు అందడంలేదని లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ తహసీల్దార్ భిక్షపతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 49 మందికి చెక్కులు వచ్చాయని 11మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సర్పంచులు ఐదేళ్లపాటు గ్రామాభివృద్ధిచేశారని సేవకు వారు విరామం ఇవ్వలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు మనోహర్, అచ్చంపేట, గున్కుల్, మల్లూర్ సొసైటీల చైర్మన్లు నర్సింహారెడ్డి, వాజిద్ అలీ, ఒంటరి కల్యాణి, ఏఎంసీ వైస్ చైర్మన్ గైని విఠల్, ఎంపీడీవో నాగేశ్వర్ తదితరులున్నారు.

'అవినీతిపరులను వదలం'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాల్లో, దళితబంధు పథకం అమలులో అక్రమాలకు పాల్పడిన వారికి ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. సోమవారం మండలంలోని సుల్తాన్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా, నిజాంసాగర్ బస్టాండ్‌లో మరుగు దొడ్లు, మూత్రశాలలు, ఉన్నత పాఠశాలలో ప్రహరి నిర్మాణం తదితర పనులకు శంకుస్థాపన చేశారు. మండల సర్వసభ్య సమావేశం అనంతరం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. పలుచోట్ల దరఖాస్తులను స్వీకరించారు. మల్లూర్ గ్రామానికి చెందిన పట్నం సంగవ్వకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరై ఇల్లు కట్టుకున్నప్పటికీ బిల్లు రాలేదని ఆమె ఎమ్మెల్యేతో మొరపెట్టుకుంది. బిల్లులు కాజేసిన వారిని వదిలిపెట్టవద్దని పంచాయతీరాజ్ ఏఈ సురేశ్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. దళితబంధు యూనిట్ల పంపిణీలో దళారులు డబ్బులు దండుకున్నారని, రూ. 10 లక్షలకు గాను రూ. 5లక్షలు మాత్ర మే ఇచ్చారన్నారు. ఆశావర్కర్లు సమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. జీపీ కార్యదర్శులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎస్ఎఫ్ఐ నాయకులు డిగ్రీ, జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, మల్లయ్యగారి ఆకాష్, సంతు తదితరులున్నారు.

మూడేళ్ల బాలుడి కిడ్నాప్



నిజామాబాద్‌రూరల్: నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద మూడేళ్ల బాలుడు కిడ్నాప్‌నకు గురైన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పలుచోట్ల యాచకవృత్తి చేసుకునే వారు జిల్లా కేంద్రానికి వలస వచ్చి కంఠేశ్వర్ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు. తల్లితండ్రులు నిద్రిస్తున్న సమయంలో వారి మూడేళ్ల బాలుడిని బైక్‌పై వచ్చిన ముగ్గురు కిడ్నాప్ చేశారు. వీరి బాలుడిని తీసుకెళ్తున్న దృశ్యాలు స్థానిక సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైస్ మిల్లులో మోటార్ల చోరీ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి శివారులో ఉన్న బాలాజీ రైస్ మిల్లులో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. రైస్ మిల్లులో ఉన్న ఐదు కరెంట్ మోటార్లను ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం మోటార్లు చోరీకి గురైనట్లు గుర్తించిన మిల్లు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీటి విలువ సుమారు రూ. 75వేలు ఉంటుందని అన్నారు. దొంగతనాల నివారణకు పోలీసులు దృష్టిసారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షను రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ సయ్యద్‌ఖదీర్ విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ సోమవారం తెలిపారు. గాంధారి మండలం చద్మల్‌కు చెందిన సంఘం శివకుమార్, నందిపేట్ మండలం దత్తాపూర్‌కు చెందిన జంగం రాజేశ్‌కు రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై మురళి సోమవారం తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ లేని ఆటోలు, జీపులకు జరిమానా విధించారు. వాహనదారులు తప్పకుండా వాహన ధ్రువీకరణ పత్రాలను తమవద్ద ఉంచుకోవాలని సూచించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

లభించని ఆచూకీ..

బాల్కొండ: ఎస్సారెస్పీలో చేపల వేటకు వెళ్లి ఆదివారం గల్లంతైన ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన రమేశ్ ఆచూకీ సోమవారం కూడా లభించలేదు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదని ఎస్సై భాస్కరా చారి తెలిపారు. మంగళవారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపడతామని ఎస్సై పేర్కొన్నారు.

నిందితుడి అరెస్టు

ఎల్లారెడ్డి: హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్‌నాయక్ సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాతెల్లి గ్రామానికి చెందిన సదానందంపై వ్యవసాయ భూమి విషయంలో అతడి అన్న కొడుకు ప్రవీణ్ ఈనెల 3న గొడ్డలితో దాడి చేశాడు. దీంతో ప్రవీణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్సై మహేశ్, సిబ్బంది ఉన్నారు.

చెరువులో ఇద్దరు యువకుల గల్లంతు


గల్లంతైన గణేశ్, బాలేశ్

బాన్సువాడ: బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానం వద్ద గల అంకుశ్‌ఖాన్ చెరువు(మినీ ట్యాంక్ బండ్)లో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గణేశ్, బాలేశ్ స్నేహితులు. వీరు సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై చెరువుకట్టకు వెళ్లారు. వీరిలో గణేశ్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. గమనించిన బాలేశ్ కాపడటానికి చెరువులోకి దిగగా ఈతరాక నీటమునిగి పోయాడు. స్థానికులు గమనించే లోపు వారు నీట మునిగారు. ఇంటినుంచి ఉదయం వెళ్లిన ఇద్దరు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు గాలించగా చెరువు కట్టపై ద్విచక్రవాహనం, చెప్పులు కనిపించాయి. స్థానికుల సమాచారంతో చెరువులో గాలింపు చర్యలు ప్రారంభించారు. రాత్రి 9గంటల వరకు గజ ఈతగాల్లతో గాలించినా ఆచూకీ లభించలేదు. గణేశ్ బీర్కూర్‌లో పదో తరగతి చదువుతుండగా, బాలేశ్‌బీర్కూర్‌లో మోటర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు.

వైన్‌షాపు నిర్వాహకులపై కేసు

కామారెడ్డి క్రైం: పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో మద్యం దుకాణం ముందు ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన నిర్వాహకులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని అజాంపూర కాలనీకి చెందిన ఆనంద్, ఆకాశ్ మద్యం కొనుగోలు చేయడానికి వచ్చి బయట మరో వాహనంపై చేయి పెట్టడంతో దొంగలుగా భావించి కర్రలతో చితకబాదారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు వైన్‌షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఆరుగురి ఆత్మహత్య

పిట్లం(జుక్కల్): జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాములు (33) ఏ పని చేయకుండా తిరిగేవాడు. ఈ భార్య అంజవ్వతో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్య చేసుకున్నాడు. రాములు తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు.

రెంజల్(బోధన్): మండలంలోని నీలా గ్రామానికి చెందిన బోనగిరి జ్యోతి(35) జీవితంపై విరక్తితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మీకి ముగ్గురు కుమార్తెలు. వీరికి వివాహాలు కాగా రెండో కుమార్తె మానసిక ఆరోగ్యం బాగా లేకపోవడంతో విడాకులు అయ్యాయి. కుమార్తె దీనస్థితిని తట్టుకోలేని తల్లి ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒంటరితనం భరించలేక..

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌లో ఒంటరితనం భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన మల్లారి రాజు(50) కొంతకాలంగా మానసిక ఆరోగ్యంతో బాధపడుతోంది. ఆదివారం రాత్రి గ్రామ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమార్తె సోని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..

మాక్లూర్: కడుపునొప్పి భరించలేక ఓ వివాహిత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై సుదీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన కొయ్యల మీనా(29) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాగా మీనా తన భర్తతో ఐదేళ్ల క్రితం విడాకులు తీసుకుంది. వీరికి నిహారిక అనే పాప ఉంది. మీనా తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి ఒకరు..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(40) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు.

అనారోగ్యంతో ఒకరు..


అలీంమియా మృతదేహం

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. నిర్మల్ జిల్లాకు చెందిన అలిమియా సాన్నా(56) గ్రామంలో ఉన్న తన కూతురు ఇంట్లో నివాసం ఉంటున్నాడు. గత ఏడాది అక్టోబర్‌లో అలిమియా భార్య మృతి చెందింది. నాటి నుంచి తీవ్ర మనస్థాపానికి గురై అనారోగ్యానికి గురయ్యాడు. సోమవారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమార్తె తస్లీమా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తిపోట్ల ఘటనలో యువకుడి మృతి


పవన్ (ఫైల్)

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన కత్తిపోట్ల ఘటనలో తీవ్రంగా గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన ముగ్గురు స్నేహితులైన పవన్, చిన్ను, చందుల మధ్య మద్యం విషయమై గొడవ జరిగింది. తొలుత పవన్‌పై చిన్ను, చందులు దాడి చేశారు. గాయపడ్డ పవన్ తన ఇంటికి వెళ్లాడు. ఘర్షణలో చిన్నుకు సైతం గాయం కావడంతో చిన్ను తల్లి రేణుక పవన్ ఇంటికి వచ్చి గొడవ పడింది. కోపంతో తనవెంట తెచ్చుకున్న కత్తితో పవన్‌ను పొడిచింది. తీవ్రంగా గాయపడ్డ పవన్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులు రేణుక, చిన్ను, చందులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మృత్యువుతో పోరాడి..

పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లి తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పన్నాలాల్ మృతి చెందారు. ఉపాధ్యాయుడు పన్నాలాల్ పిట్లం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏడాది క్రితం పొలంలో రక్త పింజరి అనే పాము కాటు వేయడంతో నాటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. సోమవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఉపాధ్యాయుడు పన్నాలాల్ మృతిపై తోటి ఉపాధ్యాయులు, తండా వాసులు సంతాపం తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

నవీపేట: మండలంలోని నాగేపూర్ శివారు బాసర రహదారి మూల మలుపు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన సోహెల్ (24) మృతి చెందాడు. ఏఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సోహెల్ తన సోదరుడు షౌకత్, మిత్రుడు కాంబేతో కలిసి బైక్‌పై నవీపేటకు వస్తుండగా అదుపు తప్పి సిగ్నల్‌ను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడ్డ సోహెల్‌ను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి సోదరుడు షౌకత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై పేర్కొన్నారు.

బురదలో పడి ఒకరు..

మాచారెడ్డి: మద్యం మత్తులో బురదలో పడి ఒకరు మృతిచెందినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ సోమవారం తెలిపారు. రాజన్న సిరిసిల్లా జిల్లాకు చెందిన టేకుమల్ల కిషన్(39) ఆదివారం దోమకొండ మండలం ముత్యంపేటలోని బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. మార్గమధ్యంలో మద్యం సేవించిన అతను భవానిపేట శివారులోని పొలంలో ప్రమాదవశాత్తు బోర్లా పడడంతో ఊపిరాడక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఎల్లారెడ్డి: పట్టణానికి చెందిన కమ్మరి శేఖర్ (29) గత నెలలో మెదక్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ శేఖర్ కోమాలోకి వెళ్లాడు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువులో పడి యువకుడు..

గాంధారి: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం గాంధారిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన గంధ్యాటం మహేశ్(25) పొలం గ్రామ సమీపంలో గల కోనాయిపల్లి చెరువు వద్ద ఉంది. పొలం వద్దనే షెడ్డులో గేదెలు ఉంటాయి. గేదెలకు నీరు తాగించడానికి పొలానికి వెళ్లిన మహేశ్ రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా చెరువులో ఒక చెప్పు తేలడంతో అనుమానం వచ్చి గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి తల్లిదండ్రులు, భార్య ఉన్నారు.